క్లుప్తంగా

పర్యావరణ హితంగా దీపావళి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బీచ్ రోడ్డు: సంప్రదాయ బద్ధంగా.. పర్యావరణ హితంగా దీపావళి పండగ జరుపుకుందామని కేడీపీఎం ఉన్నత పాఠశాల బోటనీ ఉపాధ్యాయిని రమాదేవి పిలుపునిచ్చారు. కేడీపీఎం హైస్కూల్, ఏయూ తెలుగు మీడియం స్కూల్స్‌లో శుక్రవారం గ్రీన్ క్లైమేట్ టీం, సిఫా సంస్థలు పర్యావరణ హిత దీపావళిపై అవగాహన కార్యక్రమం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాణసంచా కాల్చి శబ్ద, వాయు, జల కాలుష్యం కాకుండా చూడాలని సూచించారు. పశు, పక్ష్యాదులు, వృద్ధులు, పిల్లలకు హానికలిగించవద్దన్నారు. ఎకో వైజాగ్‌ను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, సిఫా సంస్థ ప్రతినిధులు హేమ, నర్సింగ్, ప్రసాద్, ఆంధ్రా యూనివర్సిటీ సోషల్ వర్క్ విద్యార్థినులు బి.ఉషారాణి, బి.తేజస్విని, ఆడమ్ బిసార్, బి.చైతన్య సరస్వతి, గ్రీన్ వలంటీర్ జె.రాజేశ్వరి, జె.రవితేజ తదితరులు పాల్గొని మాట్లాడారు.

ఆటోలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలి



ఎంవీపీ డబుల్ రోడ్‌లో ఆటో స్టాండ్ ప్రారంభిస్తున్న పడాల గోవిందరావు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్‌లోని గాయత్రి విద్యాపరిషత్ కళాశాల ఎదుట శ్రీకనకదుర్గా ఆటో స్టాండ్‌ను శుక్రవారం ఏఐటీయూసీ ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవిందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో ఆటోలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని జిల్లా, జీవీఎంసీ అధికారులను కోరారు. ఎన్నో ఏళ్లుగా నగరంలో పార్కింగ్ స్థలాలు లేక ఆటో డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రయాణికులను ఎక్కించుకునే, దించే క్రమంలో ట్రాఫిక్ పోలీసులు నోపార్కింగ్ పేరిట జరిమానాలు విధిస్తున్నారన్నారు. ఈ సమస్య తొలగాలంటే ప్రధాన ప్రాంతాల్లో ఆటోలకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఉండాలని, ఈ దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రవి, శేషుబాబు, సూరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లెబెన్స్‌హిల్ఫే స్కూల్ సందర్శన



పాఠశాల వద్ద ఏయూ సోషల్ వర్క్ విభాగ బృందం

ఎంవీపీకాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విభాగ ఆచార్యులు, విద్యార్థుల బృందం శుక్రవారం ఎంవీపీ కాలనీలోని లెబెన్స్‌హిల్ఫే మానసిక దివ్యాంగ విద్యార్థుల పాఠశాలను సందర్శించింది. క్షేత్రస్థాయిలో విద్యార్థులకు అందుతున్న ప్రోత్సాహం, వ్యక్తిగత సేవలు, విద్యాబోధనను అధ్యాపకులు, విద్యార్థులు పరిశీలించారు. విద్యార్థుల స్థితిగతులు, కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏయూ సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య ఎస్.హరనాథ్ మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహతో ముందుకు సాగాలన్నారు. అప్పుడే సమాజంలో సంతులిత అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. సోషల్ వర్క్ విద్యార్థుల్లో సామాజిక సేవపై అవగాహన పెంచేందుకు లెబెన్స్‌హిల్ఫే స్కూల్‌తోపాటు శాంతి ఆశ్రమ పాఠశాలను సందర్శించామని తెలిపారు. డాక్టర్ హనుమంతు లక్ష్మణ్, డాక్టర్ కోమలి సలోమి, డాక్టర్ శ్యామ్, డాక్టర్ ఆశాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇలాగేనా నిర్మించేది..?



పలకల మధ్య ఖాళీలు, మొలిచిన గడ్డి



జోడుగుళ్లపాలెంలో జీవీఎంసీ నిర్మిస్తున్న పిల్లల పార్కు

నడక దారిలో ఊడిపోయి కిందకు దిగిపోయిన పలకలు

- జీవీఎంసీ పిల్లల పార్కులో అధ్వానంగా నడక దారులు
- పలకల ఏర్పాటులో డొల్లతనం
- పనుల్లో నాణ్యత లోపం

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు జోడుగుళ్లపాలెంలో జీవీఎంసీ పిల్లల పార్కు నిర్మిస్తోంది. దీని కోసం రూ.60 లక్షల నిధులు కేటాయించింది. ఇందులో పిల్లలు ఆడుకోవడానికి పలు రకాల ఆటపరికరాలు, నడక దారులు, పెద్దలు సేదదీరడానికి షెల్టర్ నిర్మించారు. ఇంకా పచ్చదనం ఏర్పాటు చేయాల్సి ఉంది. సుమారు అరెకరం విస్తీర్ణం గల జీవీఎంసీ స్థలంలో చేపట్టిన దీని నిర్మాణం సుమారు 90 శాతం పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఆర్చ్ నిర్మిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో పార్కును ప్రారంభించేందుకు జీవీఎంసీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

అంతవరకు బాగానే ఉన్నా.. ఇక్కడ పూర్తయిన పనుల్లో నాణ్యత లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పార్కు ప్రారంభం కాక ముందే నడక దారుల్లో డొల్లతనం బయటపడుతోంది. ఈ పార్కు లోపల చుట్టూ నడక దారులు నిర్మించారు. వాటి కోసం తెలుపు, నలుపు చారలతో కూడిన పలకలు వినియోగించారు. అవి ఒకదానికొకటి కలుపుతూ అమర్చడంలో ఖాళీలు ఏర్పడ్డాయి. వాటి మధ్యలో కొన్ని చోట్ల గడ్డి మొలకలు బయటకు వస్తున్నాయి. మరికొన్ని చోట్ల అమర్చిన పలకలు కిందకు దిగిపోవడంతో ఎత్తుపల్లాలు ఏర్పడ్డాయి. ఇంకొన్ని చోట్ల పలకల మధ్య ఎక్కువ వెడల్పుతో కూడిన ఖాళీలున్నాయి. వాటిని సిమెంట్, ఇసుక ముద్దలతో పూడ్చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇసుక, సిమెంట్ కరిగిపోయి పలకల మధ్య ఖాళీలు బయటపడ్డాయి. పార్కు ప్రారంభమై వినియోగంలోకి వస్తే దీనిపై నడక ఇబ్బందిగా ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. జీవీఎంసీ అధికారులు పర్యవేక్షణతో పనులు సక్రమంగా జరిపించాలని వారు కోరుతున్నారు.

కృష్ణా కళాశాల అధ్యాపకులకు పదోన్నతి



బి.చంద్రమౌళి



కె.రేఖ



టి.శామ్యూల్ డేవిడ్

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్న ముగ్గురికి ప్రిన్సిపాళ్లుగా పదోన్నతులు లభించాయి. బోటనీ అధ్యాపకుడు డాక్టర్. బి.చంద్రమౌళిని పుత్తూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా, బయోటెక్నాలజీ అధ్యాపకురాలు డాక్టర్ కె.రేఖను విజయనగరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా, జువాలజీ అధ్యాపకుడు డాక్టర్ టి.శామ్యూల్ డేవిడ్ రాజ్‌ను పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు వీరిని అభినందించారు.

విశాఖలో అంతర్జాతీయ నృత్య కాంగ్రెస్



లోగో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

మద్దిలపాలెం: విశాఖ వేదికగా డిసెంబర్ 27 నుంచి 29 వరకు అంతర్జాతీయ నృత్య కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించనున్నామని నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు విక్రమ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఈవెంట్ లోగో పోస్టర్‌ను శుక్రవారం రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా ఆవిష్కరించామన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నృత్యకారులు, కొరియోగ్రాఫర్లు, పరిశోధకులు, ఔత్సాహికులను ఒకచోట చేర్చే అద్భుతమైన ఈవెంట్‌కు నాంది పలికారని మంత్రి దుర్గేష్ పేర్కొనడం విశేషమన్నారు. విభిన్న సంస్కృతుల నుంచి సంప్రదాయ నృత్య వారసత్వాన్ని సంరక్షించడం, ప్రోత్సహించడంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని విక్రమ్ గౌడ్ చెప్పారు. దేశ, విదేశాల నుంచి సంప్రదాయ నృత్యాల అద్భుతమైన ప్రదర్శనలతోపాటు వర్క్‌షాప్‌లు జరుగుతాయన్నారు. సంప్రదాయ దుస్తులు, ఉపకరణాల నృత్య సంబంధిత కళాఖండాలను ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. యువ ప్రతిభను ప్రోత్సహించేందుకు స్నేహపూర్వక నృత్య పోటీలకు డ్యాన్స్ కాంగ్రెస్ ఆహ్వానిస్తోందన్నారు. నృత్య సంస్థలు, బృందాలతోపాటు వ్యక్తిగత నృత్యకారులు, కొరియోగ్రాఫర్లు పాల్గొన్నవచ్చునని విక్రమ్ గౌడ్ తెలిపారు. నాట్య పరిశోధకులు, పండితులకు అవకాశాలున్నాయన్నారు.

మేధో చర్చలకు వేదికగా సదస్సులు



సదస్సులో పాల్గొన్న ఏయూ వీసీ ఆచార్య శశిభూషణరావు తదితరులు

మద్దిలపాలెం: మేధో చర్చలకు వేదికలుగా సదస్సులు నిలవాలని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. ఏయూ జియో ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న 'జియో స్పేషియల్ టెక్నాలజీస్ ఆన్ రిజర్వాయిర్స్ అండ్ ఎన్విరాన్మెంటల్ చాలెంజెస్' జాతీయ సదస్సును శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వర్తమాన ప్రాధాన్యం కలిగిన అంశం మీద సదస్సు నిర్వహించడంపై నిర్వాహకులను అభినందించారు. శతాబ్దానికి చేరువవుతున్న ఏయూలో విద్యనభ్యసించడం ఎంతో గర్వకారణమన్నారు. విద్యార్థులు తమ సంపూర్ణ సమయాన్ని నూతన జ్ఞానాన్ని పొందడానికి వెచ్చించాలని సూచించారు. విద్యతోపాటు క్రమశిక్షణ ఎంతో అవసరమని, ఇది విద్యార్థి భావిజీవితానికి పునాదిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ వాటర్ రిసోర్సెస్ డిపార్ట్‌మెంట్ విశ్రాంత చీఫ్ ఇంజినీర్ వి.శ్రీధర్, ఇండియన్ సొసైటీ ఆఫ్ జియోమేటిక్స్ విశాఖ ప్రాంతీయ కేంద్రం చైర్మన్ ఆచార్య కె.నాగేశ్వరరావులు ప్రసంగించారు. సదస్సు ప్రాముఖ్యత, రెండు రోజుల సదస్సులో చర్చించే అంశాలను విభాగాధిపతి, సదస్సు కన్వీనర్ ఆచార్య పి.జగదీశ్వరరావు వివరించారు. సదస్సు కన్వీనర్ ఆచార్య సి.వి.వి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఓటు చాలా కీలకం

ఎంవీపీకాలనీ: స్థానిక సమత కళాశాలలో శుక్రవారం ఓటు హక్కు ప్రాధాన్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డిప్యూటీ కలెక్టర్ డి.సునీత మాట్లాడుతూ విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరించారు. ఓటే తమ భవిష్యత్‌ను నిర్దేశిస్తుందనే విషయాన్ని ప్రతి విద్యార్థి గుర్తుంచుకోవాలన్నారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడంలో ఓటు చాలా కీలకమన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని సూచించారు. ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ యామిని, పలువురు కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి మద్యం షాపులపైనే శ్రద్ధ



నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలని ర్యాలీ చేస్తున్న సీపీఐ నాయకులు

ఆరిలోవ: కూటమి ప్రభుత్వానికి మద్యం షాపులు ఏర్పాటు చేయడంలో ఉన్న శ్రద్ధ నిత్యావసర సరకుల ధరలు తగ్గించడంపై లేదని సీపీఐ తూర్పు నియోజకవర్గ కార్యదర్శి ఎస్.కె రెహ్మాన్ ఎద్దేవా చేశారు. సీపీఐ ఆరిలోవ జోన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆరిలోవ కాలనీలో నిత్యావసర ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఇంటింటికి, కిరాణా షాపుల వద్దకు వెళ్లి ధరలు పెరిగిన తీరుతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెహ్మాన్ మాట్లాడుతూ నాలుగు నెలలుగా నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ఆర్థిక భారంతో సామాన్యులు కూరగాయలు, పప్పులు, నూనెలు, బియ్యం కొనలేని పరిస్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ధరలు అదుపు చేయలేకపోతోందని విమర్శించారు. ఆరిలోవ ప్రాంతంలో ఎక్కడపడితే అక్కడ జనావాసాల మధ్య కొత్తగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారని తెలిపారు. వీటి వల్ల జనం రోడ్డు మీదకు రావడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రజల సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకొని వాటిని వేరే చోటకు తరలించే విధంగా ఎక్సైజ్ అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు క్షేత్రపాలు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం అధ్యక్షుడిగా సన్యాసిరావు ఎన్నిక చెల్లదు



మాట్లాడుతున్న గుమ్మడి నరసింగరావు

ఎంవీపీకాలనీ: జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఒమ్మి సన్యాసిరావు వ్యవహరించడం నిబంధనలకు విరుద్ధమని ఆ సంఘ కీలక సభ్యుడు గుమ్మడి నరసింగరావు అన్నారు. అధ్యక్షుడిగా అయన ఎన్నిక చెల్లదని పేర్కొన్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్-1లోని ఓ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా యాదవ సంక్షేమ సంఘం నాయకులు, సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింగరావు మీడియాతో మాట్లాడుతూ సంఘానికి అనధికారిక అధ్యక్షుడిగా కొన్నేళ్లుగా ఒమ్మి సన్యాసిరావు కొనసాగడం దారుణమన్నారు. జిల్లా యాదవ సంక్షేమ సంఘం రిజిస్ట్రేషన్ నంబర్ 294/79తో పల్లా సింహాచలం తొలి అధ్యక్షుడిగా ప్రారంభమైందని గుర్తు చేశారు. ఆయన అనంతరం భరణికాని రామారావు సంఘ సభ్యుల సమ్మతితో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారన్నారు. నాటి నుంచి నేటి వరకు అధికారికంగా అయనే సంఘానికి అధ్యక్షుడిగా ఉన్నారని తెలిపారు. ఒమ్మి సన్యాసిరావు ఉత్తరాంధ్ర యాదవ సంఘం పేరుతో కొందరు నాయకులను పోగేసి రాధాకృష్ణ మహోత్సవాల నిర్వహణ పేరుతో తెరపైకి వచ్చారన్నారు. ఆయన ఆధ్వర్యంలో కొంతమంది నాయకులు గ్రూపుగా ఏర్పడి యాదవ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ప్రకటించేసుకున్నారని పేర్కొన్నారు. సంఘం మాజీ కమిటీ, సభ్యుల ఆమోదం లేకుండా వారికి వారే ప్రకటించుకోవడం సిగ్గుచేటన్నారు. గతేడాది రాధాకృష్ణ మహోత్సవాలు ఘనంగా జరగకుండా వారే నీరుగార్చినట్లు ఆరోపించారు. త్వరలోనే సంఘ పెద్దలు, సభ్యుల ఆమోదంతో అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ప్రసాదాల భాగ్యానంద్, ఆర్సీ అప్పలనారాయణ, కోర్రాయ్య అప్పారావు, మువ్వల సత్యనారాయణ, సర్వసిద్ధి వెంకటరమణ, చందక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోలీస్ విధులపై అవగాహన



విద్యార్థులకు పోలీస్ విధులను తెలియజేస్తున్న సీఐ మల్లేశ్వరరావు, ఎస్‌ఐలు

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఆరిలోవలోని విజేత స్కూల్ విద్యార్థులను సాయంత్రం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. వారికి పోలీస్ శాఖ అందించే సేవలు, విధి విధానాలపై సీఐ హెచ్.మల్లేశ్వరరావు, ఎస్‌ఐలు కృష్ణ, రాందాస్ అవగాహన కల్పించారు. పోలీసుల విధుల నిర్వహణ, వారి బాధ్యతలు, ఏవిధంగా నేర నియంత్రణ చేస్తున్నారు.. తదితర అంశాల గురించి తెలియజేశారు. యువత ఏవిధంగా నడుచుకోవాలి, మంచి మార్గంలో నడిచేవారి భవిష్యత్ ఎలా ఉంటుంది, చెడు మార్గంలో నడుస్తూ చెడ్డవారితో స్నేహం చేస్తే ఏవిధంగా నేరాల్లో ఇరుక్కుంటారు.. తదితర అంశాల గురించి స్టూడెంట్లకు వివరించారు. కార్యక్రమంలో 50 మంది విద్యార్థులతోపాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాపార విస్తరణకు విశాఖ అనుకూలం

బీచ్ రోడ్డు: టైర్ 2 నగరాల్లో ఒకటైన విశాఖపట్నం వ్యాపార విస్తరణకు అనుకూలమైనదని బిగ్ బాస్కెట్ రిటైల్ మార్కెటింగ్ హెడ్ రాగాలీన శ్రీపాద అన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడారు. టైర్ 2 నగరాల్లో ఉండే కస్టమర్‌కు 10 నిమిషాల్లో విస్తృత శ్రేణి ఉత్పత్తులను డెలివరీ చేయడంపై వారు చూపుతున్న ఉత్సాహాన్ని చూసి సంతోషంగా ఉందన్నారు. ఈ దీపావళికి అవసరమైన బంగారం, వెండి నాణేలు, హోం డెకార్, డ్రై ఫ్రూట్స్, గిఫ్టింగ్ శ్రేణి సహా అన్ని వస్తువులను 10 నిమిషాల్లో కస్టమర్ ఇంటి వద్ద సౌకర్యవంతంగా అందించేందుకు కట్టుబడి ఉన్నామని మార్కెటింగ్ హెడ్ తెలిపారు.

గర్భిణికి విజయవంతంగా 'రోబోటిక్ సర్జరీ'



ప్రసవం అనంతరం ఆరోగ్యంగా ఉన్న తల్లీబిడ్డతో మెడికవర్ హాస్పిటల్ వైద్యుల బృందం

ఎంవీపీకాలనీ: స్థానిక మెడికవర్ హాస్పిటల్ వైద్యులు మరో అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. రాష్ట్రంలో తొలిసారిగా ఓ గర్భిణికి రోబోటిక్ అబ్డోమినల్ సెర్‌క్లాజ్ సర్జరీని విజయవంతంగా నిర్వహించినట్లు ఆస్పత్రి యాజమాన్యం శుక్రవారం తెలిపింది. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్ డాక్టర్ కిరణ్మయి గొట్టపు మాట్లాడుతూ విశాఖకు చెందిన 34 ఏళ్ల మహిళకు ఆరు సార్లు అబార్షన్‌తోపాటు రెటినోపతితో బాధ పడుతుండటం వల్ల ప్రీమెచ్యూరిటీ ప్రసవం జరిగిందన్నారు. గర్భాశయ లోపం కారణంగా అనేక సార్లు గర్భధారణ నష్టాలకు దారితీసిందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆమె మెడికవర్ ఆస్పత్రికి రాగా.. వైద్యుల బృందం సమస్యను పరిష్కరించడానికి ఇన్వాసివ్ రోబోటిక్ సహాయంతో అబ్డోమినల్ సెర్‌క్లాజ్ సర్జరీని ఎంచుకున్నారన్నారు. ఈ ప్రక్రియ తరువాత గర్భం సజావుగా సాగిందన్నారు. రాష్ట్రంలో తొలిసారి ఈ విధానం ద్వారా మహిళ గర్భాన్ని సంరక్షించి ప్రసవం చేసినట్లు తెలిపారు. ఇటీవల ఆ మహిళ ఆరోగ్యకరమైన శిశువుకు జన్మనిచ్చినట్లు చెప్పారు. 24/7 హాస్పిటల్ వైద్యులు ఆమె గర్భాన్ని సంరక్షించడంతో ఈ విజయం సాధ్యమైందన్నారు.

కత్తి చూపించి.. రూ.500తో పరార్

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని ఇద్దరు యువకులు.. మరో ఇద్దరు యువకులకు కత్తి చూపించి బెదిరించారు. ఆఖరికి పోలీసులకు చిక్కారు. ఆరిలోవ క్రైం ఎస్‌ఐ ఎ.హరికృష్ణ తెలిపిన వివరాలిలా.. ఆదర్శనగర్‌లోని సుందర్‌నగర్‌కు చెందిన కంచ్రెడ్డి నిఖిత్, అతడి స్నేహితుడు దొడ్డి భానుకిరణ్‌తో కలిసి ఈ నెల 24న సాయంత్రం రుషికొండ నుంచి బీచ్ రోడ్డులో ద్విచక్ర వాహనంపై వస్తూ జోడుగుళ్లపాలెంలో ఓ పాన్ షాపు వద్ద ఆగారు. అక్కడికి ఇద్దరు గుర్తు తెలియని యువకులు వెళ్లారు. షాపు వద్ద ఉన్న నిఖిత్, భానుకిరణ్‌లను సిగరెట్ అడిగారు. లేదనడంతో వెంటనే వారిద్దరు కత్తి చూపించి నిఖిత్, అతడి స్నేహితుడిని బెదిరించారు. గుర్తు తెలియని ఓ వ్యక్తి నిఖిత్ ప్యాంట్ వెనుక జేబులో చేయిపెట్టి డబ్బులు తీయడానికి ప్రయత్నించాడు. దీన్ని గమనించిన నిఖిత్ వారిని నిలువరించినప్పటికీ జేబులో రూ.500 తీసుకొని వారిద్దరు పారిపోయారు. ఈ ఘటనపై నిఖిత్, భానుకిరణ్ కలిసి ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులిద్దరినీ శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఆరిలోవ అన్నానగర్‌కు చెందిన బి.రాజు, తోటగరువు దరి బీఎస్ఆర్ నగర్‌కు చెందిన కె.కిరణ్‌గా గుర్తించారు. వారి నుంచి రూ.300 రికవర్ చేసినట్లు క్రైం ఎస్‌ఐ హరికృష్ణ తెలిపారు.

జిల్లా సంక్షేమ శాఖాధికారులతో మంత్రి సమీక్ష



మంత్రి బాల వీరాంజనేయస్వామికి పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారులు

ఎంవీపీకాలనీ: రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డి.బాల వీరాంజనేయ స్వామి జిల్లాలోని సంక్షేమ శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. సిరిపురంలోని గవర్నర్ బంగ్లాలో శుక్రవారం ఈ సమావేశం జరిగింది. ఆయా శాఖల ద్వారా ప్రస్తుతం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ప్రాజెక్టులు, వసతి గృహాల నిర్వాహణ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ఉద్యోగుల పనితీరుపై మంత్రి ఆరా తీశారు. విభాగాల వారీగా పనితీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే సౌకర్యాల్లో ఎలాంటి లోటు రాకూడదన్నారు. డీఎస్సీ అభ్యర్థులు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకునేలా పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని సూచించారు. ముందుగా మంత్రికి ఆయా శాఖల అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. సాంఘిక సంక్షేమం, బీసీ సంక్షేమం, ఎస్సీ, బీసీ కార్పొరేషన్లకు చెందిన డీడీలు, ఈడీలు పాల్గొన్నారు.

ఉద్యోగులను వేధిస్తే ఉద్యమమే..



మాట్లాడుతున్న ఎన్ఎంయూఏ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

మద్దిలపాలెం: ప్రజా రవాణా శాఖలో ఉద్యోగులను వేధించే అధికారులపై ఉద్యమం తప్పదని, దాని తగిన గుణపాఠమే విశాఖ ఉద్యోగుల ఉద్యమమని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు అన్నారు. ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. 70 రోజులు జిల్లా వ్యాప్తంగా నిరసనలతోపాటు 45 రోజులు నిరవధిక రిలే నిరాహార దీక్షలు నిర్వహించి విజయం సాధించామన్నారు. జిల్లా కార్మికులతో పాటు వాల్తేర్ డిపో ఉద్యోగులందరికీ అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఎల్లప్పుడూ కార్మిక సమస్యలపై అంకితభావంతో అందరూ అందుబాటులో ఉంటూ పనిచేయాలని కోరారు. 1/2019 సర్క్యులర్ అమలు జరిగేలా చూస్తామని, నైట్ ఔట్ అలవెన్స్‌లు పేస్లిప్‌లో వచ్చేలా ప్రభుత్వ జీవో త్వరలో వస్తుందని, మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఆర్టీసీ పాత వైద్య సౌకర్యం తిరిగి అమలు జరిగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, అమలుకు పెద్దలు హామీ ఇచ్చారన్నారు. డిపో కార్యదర్శి ఆర్.వసంతరావు మాట్లాడుతూ ఉద్యమంలో సహకరించిన అన్ని డిపోల ఉద్యోగులు, అధ్యక్ష, కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర కోశాధికారి పి.వి.వి. మోహన్, డివిజన్ కార్యదర్శి ఎ.ఎ.శివాజీ, డిపో చైర్మన్ బి.రవి, అధ్యక్షుడు పి.జి.పతి, అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ శిథిలం



జోడుగుళ్లపాలెం బీచ్ రోడ్డులో శిథిలమైన బస్ షెల్టర్

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు జోడుగుళ్లపాలెంలో బీచ్ రోడ్డును ఆనుకొని ఉన్న బస్ షెల్టర్ శిథిలావస్థకు చేరింది. దీని వెనుక గోడలు కూలిపోయాయి. పైన షెల్టర్ కోసం వేసిన రేకులు విరిగిపోయాయి. సందర్శకులు బస్‌లు, ఆటోల కోసం నిరీక్షించడానికి షెల్టర్ లోపల ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మలు పాడయ్యాయి. షెల్టర్ నుంచి విరిగిపోయిన రేకులు కిందకు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. ఇవి ఎప్పుడు కిందకు జారిపోతాయోనని స్థానికులు భయపడుతున్నారు. దీంతో పాటు బస్ షెల్టర్ వెనుక చెత్తతో నిండిపోయి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. స్థానికులు, జోడుగుళ్లపాలెం బీచ్‌కు వెళ్లే పర్యాటకులు సైతం ఆర్టీసీ బస్‌లు, ఆటోల కోసం ఈ షెల్టర్ వద్దే నిరీక్షించాల్సి వస్తుంది. ఇక్కడ శిథిలమైన షెల్టర్‌ను తొలగించి దాని స్థానంలో కొత్తది నిర్మించాలని జీవీఎంసీ అధికారులను స్థానికులు కోరుతున్నారు.